క్లుప్తంగా

మేడా నామినేషన్‌కు తరలిన నేతలు



మేడా రఘును సత్కరిస్తున్న నాయకులు

రాజంపేట : రాజ్యసభ అభ్యర్థిగా మేడా రఘునాథరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచే కాకుండా ఉభయ వైఎస్సార్ జిల్లాల నుంచి పలువురు నాయకులు, అభిమానులు, మేడా వర్గీయులు తరలివెళ్లారు. నామినేషన్ వేసిన అనంతరం మేడా రఘును పలువురు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. రాజకీయాలకు అతీతంగా తరలివచ్చారు. ఇందులో కబడ్డీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరక్టరు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఏపీఐసీసీ స్టేట్ డైరక్టరు తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, నందలూరు సింగల్‌విండో అధ్యక్షుడు పాలగిరి సుధాకర్‌రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు లక్ష్మినరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పోలీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

21న మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సమావేశం 21న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో, ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన అన్నారు.

నేడు టమటంవాండ్లపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష

రాయచోటి అర్బన్ : రాయచోటి రూరల్ మండలం పరిధిలోని మాధవరం గ్రామం టమటంవాండ్లపల్లెలో 13వ తేదీన నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి కోరారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మాధవరం - 2 సచివాలయం పరిధిలోని వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లో ఉచిత వైద్యశిబిరం జరుగుతుందన్నారు. ఆరోగ్య శిబిరంలో యండపల్లె పీహెచ్‌సీ వైద్యులతోపాటు ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, కంటి వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు. శిబిరంలో 7 రకాల ఉచిత పరీక్షల చేయడంతోపాటు 105 రకాల మందులు, మాత్రలతో పాటు అర్హులకు ఉచిత కంటిఅద్దాల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని మాధవరం-2 సచివాలయం పరిధిలోని ప్రజలందరూ సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రతాప్ రెడ్డి

సంబేపల్లె : గ్రామాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీలో దాదాపు రూ. 15 లక్షలతో సిమెంట్ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిల సహకారంతో గ్రామాల సమగ్రాభివృద్ధి జరుగుతోందన్నారు. ఇప్పటికే సంబేపల్లెలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర, ఈఓపీఆర్‌డీ రవీంద్ర, ప్రసాద్ రెడ్డిలు పాల్గొన్నారు.

అర్జీదారులకు భోజన వసతి



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులకు అందించే ఉచిత భోజన కార్యక్రమం 47వ వారానికి చేరుకుంది. ఈ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్ ద్వారా జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు పలు రకాల విషయాలపై ఫిర్యాదులు సమర్పించేందుకు అనేక మంది వస్తుంటారు. వారి ఆకలి తీర్చేందుకు ఆయన తన సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఆర్థిక సహాయం

పుల్లంపేట : రంగంపల్లి పంచాయతీ ఆర్.వడ్డిపల్లి గ్రామానికి చెందిన బత్తల ప్రసాద్ (43) శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో మృతి చెందాడు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం మృతుడి కుటుంబానికి సాయివికాస్ రెడ్డి రూ. 20 వేలు, అదే గ్రామానికి చెందిన గండికోట విజయశేఖర్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డిలు ఇద్దరు రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, యానాదయ్య, రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

'స్పందన'కు అధికారులు రావాల్సిందే

రాజంపేట ఆర్డీఓ మోహనరావు వెల్లడి



రామాపురం: రైతుల సమస్యలపై తహసీల్దార్‌తో మాట్లాడుతున్న గడికోట మోహన్‌రెడ్డి



రాజంపేట: స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న ఆర్డీఓ మోహనరావు

రాజంపేట : రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లో ఇక నుంచి నిర్వహించే స్పందనకు డివిజనల్ అధికారులు తప్పకుండా హాజరుకావాలని, ఈ మేరకు అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేశామని రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి మోహనరావు వెల్లడించారు. ఆర్డీఓగా బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారిగా సబ్‌కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్పందనకు ఆయాశాఖ డివిజన్ బాధ్యత అధికారులు హాజరు కావడం వల్ల ప్రజల నుంచే వచ్చే వినతులు పరిష్కారానికి మార్గం సులభతరమవుతుందన్నారు. స్పందన ఒక్క ఆర్డీఓ, తహసీల్దారులకే బాధ్యత కాదని, అన్ని శాఖల బాధ్యత అన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తే స్పందన పట్ల ప్రజల్లో ప్రగాఢ విశ్వాసం, నమ్మకం కలుగుతుందన్నారు. కింద స్థాయిలో తమ సమస్య పరిష్కరించలేని స్థితిలో డివిజనల్ స్థాయిలో పరిష్కారమవుతుదనే భావన ప్రజల్లో కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్పందనకు వచ్చే వారి పట్ల ఆప్యాయత, అభిమానం, చిరునవ్వుతో ఆహ్వానించి, వారి సమస్యను సానుకూలంగా విని పరిష్కరిస్తే కచ్చితంగా ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. డివిజన్‌లో అన్ని మండలాలు ప్రజలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీలైనంత వరకు డివిజనల్ స్థాయిలో తాను స్పందనలో వచ్చిన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మండల, డివిజన్ కేంద్ర స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడే స్పందన లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా స్పందనలో 12 వినతులు వచ్చాయి.

పెనగలూరులో..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : స్పందన అర్జీలపై ఎప్పటికప్పుడు రెవెన్యూ సిబ్బంది స్పందించాలని తహసీల్దార్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్సు అనంతరం రెవెన్యూ సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్పందనపై వచ్చిన అర్జీలపై స్పందించాలన్నారు. అలాగే పోలింగ్ బూత్‌లలో ఉన్న సమస్యలపై కూడా స్పందించాలని, ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పలు అంశాలపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

రామాపురం : మండలంలోని పలు భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో స్పందనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ అరవింద్ కిషోర్‌ను కోరారు. అడంగల్, 1బిలో భూమి కొలతలు తదితర అంశాలపై వచ్చిన రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో జగన్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అధికారులు రైతుల సమస్యలను పట్టించుకోకుండా వేధిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సమావేశంలో లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సర్పంచ్‌లు భూషన్‌రెడ్డి, వెంకటరెడ్డి, రామాంజులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేద్దాం

- రాజంపేట మున్సిపాలిటీలో మెజార్టీ సాధించేలా కృషి చేయాలి
- కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

రాజంపేట : రాజంపేట మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ మెజార్టీని కైవసం చేసుకునేలా పట్టణ నేతలు సమైక్యంగా కలసిమెలసి, సమన్వయంతో కృషి చేయాలని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం ఆకేపాటి ఎస్టేట్‌లో మున్సిపాలిటీ స్థాయి వైఎస్సార్‌సీపీ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలంటే రాజంపేట కోటపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. అన్ని వర్గాలకు సీఎం చేసిన మేలును ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా జగనన్నకు వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక విషం కక్కుతున్నారన్నారు. వాటన్నింటిని తిప్పికొట్టే విధంగా పట్టణ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాజంపేట అంటే రాజన్నదే అన్నట్లు పట్టణంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీ సాధించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనరు కృష్ణారావు యాదవ్, పట్టణ జేసీఎస్ కన్వీనరు వడ్డె రమణ, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు గుల్జార్ బాషా, బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర నేత వెంకటేశు, కో-ఆప్షన్‌సభ్యుడు రాము యాదవ్, కౌన్సిలర్లు కూండ్ల రమణారెడ్డి, పసుపులేటి సుధాకర్, రహంతుల్లా, సూరి, మైనార్టీ నాయకులు జావిద్, మునాఫ్, మసూద్, ఖాదర బాషా, బీసీ నాయకులు మీసాల వెంకటసుబ్బయ్య, మురళీ ఆచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌నాయుడు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు నాగరికతకు ప్రతీకలు



శిలాఫలక ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డి, నాయకులు, గ్రామస్తులు

చిన్నమండెం : ఆలయాలు నాగరికతకు ప్రతీకలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు గ్రామం దిన్నెమీదపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్ల విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే, దేవనాథరెడ్డితో కలిసి పాల్గొన్నారు. నాయకులను గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. వారిచేత ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహింపజేసి తీర్థప్రసాదాలు అందజేయడంతోపాటు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు మాట్లాడుతూ సీతారాముల ఆలయాన్ని గ్రామస్తులు, దాతలు సమష్టిగా నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. సీతారాముల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజమ్మ, వెంకటరమణ, ఎంపీటీసీ శ్రీదేవి, నరేష్‌స్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మద్దిరెడ్డి, మల్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటరమణ, రెడ్డయ్య, రామమోహన్‌రెడ్డి, భైరవనాథరెడ్డి, మల్లేష్, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి కొరత తలెత్తకూడదు



పాతరాయచోటిలో వాటర్ స్కీం బోరును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

రాయచోటి అర్బన్ : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ పరిధిలో ఎక్కడా నీటి కొరత తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో పట్టణంలో ఎక్కడా నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన కమిషనర్ మంగళవారం పట్టణ పరిధిలోని పలు నీటి సరఫరా బోర్లు, నీటి నిల్వలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరచూ నీటి సమస్య ఎదురవుతున్న పాతగొల్లపల్లె, పాత రాయచోటి ఏరియాలో పర్యటించి, బోర్లను పరిశీలించారు. నీటి సరఫరా అంశంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలంటూ ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. ప్రజలు ఎవరైనా తాము ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను తమకు ఫోన్ ద్వారా తెలిపినా సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామంటూ సూచించారు. ఎంతో వ్యయ, ప్రయాసలకు ఓర్చి వెలిగల్లు జలాశయం నుంచి రాయచోటి పట్టణానికి తీసుకువస్తున్న మంచినీటిని వృథా చేయవద్దంటూ ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ ఏఈ వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్ఐ మల్లికార్జున, ఫిట్టర్ రామక్రిష్ణతోపాటు వాటర్‌వర్క్స్ సిబ్బందిలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

రాయచోటి అర్బన్ : రాయచోటి రూరల్ మండలం చెన్నముక్కపల్లె పంచాయతీ పరిధిలోని 5వ వార్డులో పిల్లల సౌకర్యార్థం ప్రభుత్వం నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మత్రి సుమిత్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ 5వ వార్డులో 100 కుటుంబాలకు పైగా జీవిస్తున్నారన్నారు. వీరి పిల్లలకు దగ్గరలో ఎక్కడా అంగన్‌వాడీ కేంద్రం లేనందున ఇబ్బందులు తలెత్తడంతోపాటు గర్భిణులు, చిన్నపిల్లలు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ చూపి 5వవార్డులో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు సుబ్బమ్మ, నసీబ్‌జాన్, సనాతోపాటు పలువురు మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.

భుజంగేశ్వరుడికి పూజలు



భుజంగేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని భుజంగేశ్వర ఆలయంలో చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో మాఘమాస మొదటి సోమవారం పురస్కరించుకొని భుజంగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కాలభైరవుడికి పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె భైరవ గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడికి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం శ్రీ కాలభైరవుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం భక్తుల దర్శన ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం



ప్రిన్సిపాల్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అశోక్

రాజంపేట టౌన్ : విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాజంపేట ఏరియా ఆసుపత్రి డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ఆరోగ్య సమస్యలు పిన్న వయస్సు గల వారికి కూడా వస్తున్నాయన్నారు. అందువల్ల విద్యార్థులు క్రమం తప్పకుండా వాకింగ్, వ్యాయామం వంటివి చేయాలని సూచించారు. మితాహారం తీసుకుంటూ, నూనెతో చేసిన ఆహార పదార్థాలను తక్కువగా తీసుకోవాలన్నారు. మాంసాహారం కంటే ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. చాలా మంది విద్యార్థులు పొగాకు, మద్యం వంటి అలవాట్లు చేసుకుంటున్నారని ఇది ఆరోగ్యం పట్ల తీవ్ర ప్రభావం చూపడమే కాక భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తుందన్నారు. అందువల్ల విద్యార్థులు ఏ దశలోనూ చెడు అలవాట్లకు బానిసలు కాకూడదన్నారు. ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ పరీక్షల సమయం ఆసన్నమైందని ఈ సమయంలో ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ తీసుకోవాల్సివుందన్నారు. ఈ తరుణంలో ఆరోగ్య సమస్య తలెత్తితే ఆ ప్రభావం పరీక్షలపై పడుతుందని చెప్పారు. వైద్యులు తెలిపిన సూచనల మేరకు ఆహార పదార్థాలను తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, అధ్యాపకులు వి.పార్వతి, బి.నాగరాజు, వైద్య సిబ్బంది కె.మహేశ్వరి, మాధవి, రాములమ్మ, ఎం.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

చెరువులపై నివేదిక ఇవ్వండి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని చెరువులపై నివేదిక ఇవ్వాలని అసిస్టెంట్ ఫిషరీస్ అధికారి నరసయ్య తహసీల్దార్‌ను కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో చెరువులపై నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ మురళీ కృష్ణకు తెలియజేశారు. పెనగలూరు, సింగనమల, ఓబిలి, గోవిందంపల్లి, ఈటమాపురం, కట్టావారిపల్లె, వెలగచర్ల ఇతర చెరువులలో నీరు లేదని తమకు నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులకు మండలంలో నీటి సమస్య గురించి తెలియజేసేందుకు వీలుంటుందన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

గాలివీడు : గ్రామాలలో కొంత మంది అక్రమంగా విక్రయించే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ వెంకట ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పల్లెలో 15 నుంచి 20 మద్యం బాటిళ్లను తీసుకొని మందుబాబులకు అమ్ముతున్నారని, ఇలాంటి సంఘటనల్లో ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు. గ్రామాలలో అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచామని అక్రమంగా విక్రయాలు జరిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఐ

వాహన సేవలో శ్రీనివాసుడు

తంబళ్లపల్లె: కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, అర్చకులు రమేష్‌బాబు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం ముత్యపు పందెరి, రాత్రి సింహవాహనంపై స్వామివారిని సంప్రదాయ బద్ధంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అప్రెంటిస్ విధాన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు జీఓ ప్రతులను దగ్ధం చేశారు. సోమవారం స్థానిక డైట్ పాఠశాలలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, రాయచోటి అధ్యక్షుడు రాజారమేష్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోగా కావాలనే కొత్త సమస్యలను సృష్టించడం తగదన్నారు. నోటిఫికేషన్ విడుదల చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులను, నిరుద్యోగులను మోసం చేస్తుండడం సిగ్గుచేటన్నారు. నోటిఫికేషన్‌లో సుదీర్ఘకాలం పోరాటం చేసి రద్దు చేసుకున్న అప్రెంటిస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరింపజేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారన్నారు. వెంటనే నోటిఫికేషన్‌తోపాటు అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు తిరుపతి, అన్వర్‌బాషా, మధుసూదన్‌రాజు, హరిక్రిష్ణ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

సాల్ట్ శిక్షణా కార్యక్రమాన్ని వాయిదా వేయాలి

జిల్లాలో ఈనెల 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సబ్జెక్టు ఉపాధ్యాయులకు టీచ్ టూల్ అంశంపై నిర్వహింపతలపెట్టిన సాల్ట్ పథకం శిక్షణా కార్యక్రమాన్ని వెంటనే వాయిదా వేయాలని హరిప్రసాద్, రాజరమేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఈమేరకు డీఈఓ కార్యాలయ ఏడీకి వినతి పత్రం సమర్పించారు.

వేరుశనగ పంటకు ఆశించిన తెగుళ్లు

నివారణ చర్యలు చేపట్టాలన్న బద్వేల్ ఏడీఏ నాగరాజు



వేరుశనగలో తెగుళ్ల ఉధృతిని పరిశీలిస్తున్న ఏడీఏ

సిద్దవటం : వేరుశనగ పంటలో తుప్పు తెగులు, కాండం కుళ్లు వైరస్ తెగుళ్లను గమనించినట్టు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లి, టక్కోలి రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రకాల రిజిస్టర్‌లను, ఈ-పంట నమోదు వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటకు సోకిన తుప్పు తెగులు నివారణ కోసం క్లోరోతలానిల్ మందును ఒక లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. అలాగే కాండం కుళ్లు వైరస్ నివారణ కోసం ప్రిపోనిల్ 2 మిల్లి లీటర్‌ల మందుకు ఒక లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల రసం పీల్చు పురుగు వ్యాప్తితోపాటు తెగుళ్ల ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ - పంట నమోదు, ఈకేవైసీ ప్రక్రియకు ఈనెల 15వ తేదీ చివరి తేదీ అన్నారు. అలాగే పీఎం కిసాన్, ఈకేవైసీని ఈనెల 21వ తేదీ లోపు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ శిరీషా, రైతు భరోసా కేంద్ర వ్యవసాయ సహాయకులు వంశీ, శివఫణీంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జనార్దన్, చిన్నక్క, భాగ్యలక్ష్మి, సుమలత, లక్ష్మిదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

వాల్మీకిపురం : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ తెలిపారు. వివరాలిలా.. వాల్మీకిపురం పట్టణం నమాజ్‌కట్టవీధికి చెందిన వెంకటరమణ కుమారుడు నరసింహులు (36) అక్రమంగా కర్ణాటక మద్యంను తరలిస్తున్నాడు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. కారులో 48 క్వార్టర్ బాటిళ్లు, 1350 లిక్కర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, అతడిని అరెస్ట్ చేశారు. అలాగే కారును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు నాగేశ్వర రావు, క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు. అక్రమంగా మద్యం విక్రయించిన, తరలించిన కఠిన చర్యలుంటాయని తెలియజేశారు. కేసులు నమోదు చేసి రిమాండ్ తరలిస్తామని హెచ్చరించారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం



వైఎస్సార్ చేయూతపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

ఓబులవారిపల్లె : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎం ఆర్ముగం పేర్కొన్నారు. సోమవారం గాదెల వెంకటాపురం గ్రామంలో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కార్యక్రమంలో భాగంగా చేయూత లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం ఆర్ముగం మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా 40 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ. 18,750లు చొప్పున నాలుగు విడతలుగా రూ. 75 వేలు అందించడం జరుగుతోందని, తద్వారా మహిళలు జీవన ప్రమాణాన్ని పెంపొందించేందుకు వీలుంటుందన్నారు. లబ్ధిదారులకు వచ్చిన నగదుతో ఆవులు, గొర్రెలు, గేదెలు, పొట్టేళ్లు, చిరువ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, చేయూత లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిశంకరాచార్యుల ప్రతిష్ఠాపనోత్సవాలు



హోమ పూజలు ప్రారంభిస్తున్న వేదపండితులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పట్టణంలోని కొత్తకోడూరులో నూతనంగా నిర్మించిన ఆదిశంకరాచార్యుల మఠంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా సోమవారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అధ్యక్షులు చిందుకూరి నరసింహ శర్మ మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న శంకర మఠం నిర్మాణం అందరి సహకారంతో పూర్తయ్యిందన్నారు. మంగళవారం నుంచి ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభమై బుధవారంతో ముగుస్తాయన్నారు. సుమారు 50 మంది పండితులతో విశిష్ఠ పూజలు మూడురోజుల పాటు నిర్వహించి 14వ తేదీ సద్గురు ఆదిశంకరాచార్యుల మూలవిరాట్ ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీ సురేష్ బాబు, పి.రామ్మోహన్, కోశాధికారి సురేష్, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

యార్డులో వైఎస్సార్ విగ్రహం

కడప కార్పొరేషన్ : కడప వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడం హర్షణీయమని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం శాసనసభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు గంగాదేవి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్‌లు అభినందనీయులని డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

వైవీయూలో క్యాంటీన్ ప్రారంభం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో 'ఒయాసిస్' పేరుతో నూతన క్యాంటీన్ భవనాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్.. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం రూ. 55 లక్షలు వెచ్చించి అధునాతన భవనాన్ని నిర్మించామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఆహ్లాదకరమైన వాతావరణంలో, సౌకర్యవంతంగా ఆహారపదార్థాలు భుజించేలా వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రధాన ఇంజనీర్ రాజశేఖర రెడ్డి, అధ్యాపకులు ఆచార్య జి. విజయరాఘవప్రసాద్, ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, ఆచార్య ఎ. మధుసూధన్‌రెడ్డి, డా. సుబ్రమణ్యంశర్మ, డీఈ రామచంద్రారెడ్డి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.